క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి తరలిరావాలి

టెక్కలి: ఈ నెల 11వ తేదీన నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలోని తెంబూరు రోడ్ ఫ్లైఓవర్ వంతెన సమీపంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి కోటబొమ్మాళి మండలంలోని నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.సత్యరాజ్, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, నాయకులు సంపతిరావు హేమసుందర్‌రాజు, అన్నెపు రామారావు కోరారు. ఈ మేరకు సోమవారం కోటబొమ్మాళి మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం పది గంటలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ

ఇచ్ఛాపురం రూరల్: హింసకు వ్యతిరేకంగా కలిసి కట్టుగా, ఒకే స్వరంగా ఉందామని సీసీ మోహనరావు అన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పిలుపు మేరకు సోమవారం కొళిగాం, కీర్తిపురం, పాయితారి గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలతో కలసి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వరకట్నం అంగీకరించరాదు, ఇవ్వరాదంటూ నినాదాలతో మహిళా సంఘాలు ర్యాలీ, మానవ హారం చేశారు.

సేవా కార్యకర్తకు గుర్తింపు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న హంగీర్ బెహరా

ఇచ్ఛాపురం రూరల్: ఈదుపురం గ్రామానికి చెందిన సేవా కార్యకర్త, నేషనల్ వలంటీర్ హంగీర్ బెహరాకు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ వారు 'మాస్టర్ వలంటీర్' సర్టిఫికెట్‌ను అందజేశారు. సోమవారం జిల్లా నెహ్రూ యువ కేంద్రంలో హంగీర్ బెహరా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఒక్క రోజు శిక్షణ కార్యక్రమంలో సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. గ్రీన్ వ్యాలీ ఫౌండేషన్ ప్రతినిధి ఉమారాజ్, నెహ్రూ యువకేంద్రం ప్రతినిధులు శ్రీనివాసరావు, వెంకటేష్‌లు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

కక్షసాధింపు చర్యలు తగవు

టెక్కలి: గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన వివిధ కుంభకోణాలపై చేపట్టిన దర్యాప్తుల సంగతేమిటని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సత్తారు వెంకటరమణ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత టీడీపీ హయాంలో జరిగిన కుంభకోణాలపై ప్రస్తావించకుండా ఇప్పుడు రెడ్‌బుక్ రాజ్యాంగంతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల మునుపు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల వైపు దృష్టి సారించకుండా కేవలం కక్ష సాధింపు చర్యలు, డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ప్రకటనలో మండిపడ్డారు.

రంగు మారింది గురూ..!



పసుపు రంగులోకి మారిన కంబిరిగాం వంతెన వద్ద మున్సిపల్ స్వాగత శిలాఫలకం

కాశీబుగ్గ: ఇప్పటి వరకు తెల్లరంగుతో కనిపించిన వివిధ బోర్డులు పసుపురంగులోకి మారిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న స్వాగత, ధన్యవాదాలు తెలిపే బోర్డులు, వివరాలు తెలియజేసే బోర్డులన్నీ రంగులు మార్చేస్తున్నారు. తెలుపు రంగులో ఉన్న పాత శిలాఫలకాలకు పసుపు రంగు పూస్తున్నారు. మున్సిపాలిటీ ప్రారంభంలో ఉన్నటువంటి కంబిరిగాం వంతెన, చినబడం, కోసంగిపురం, మొగిలిపాడు ప్రాంతాలలో పలు బోర్డులకు రంగులు మార్చేశారు.

వినతుల స్వీకరణ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 19 వినతులు వచ్చాయి. వీటిలో బర్త్ సర్టిఫికెట్లు అందించాలని తొమ్మిది, పింఛన్లు మంజూరు చేయాలని మూడు, టిడ్కో ఇళ్లు అందించాలని నాలుగు, మంచినీటి సరఫరా చేయాలని రెండు, కాశీబుగ్గ ఫిష్ మార్కెట్‌లో శానిటేషన్ పనులు చేపట్టాలని ఒక వినతి వచ్చినట్టు కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు.

సీపీఎం నాయకుల నిరసన

కాశీబుగ్గ: అదానీ అవినీతి వ్యవహారంపై సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు పలాసలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ స్థానిక నాయకులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ నాయకులు సీహెచ్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో అదానీతో జరిగిన అన్ని ఒప్పందాలను తక్షణమే రద్దు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అదానీ కుంభకోణంతో సంబంధం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు గోవింద్, తిరుపతిరావు, జోగారావు, రవి పాల్గొన్నారు.

తడ'బడి'తున్నాయి!

- 'నాడు-నేడు' పనులపై నీలి నీడలు
- ముందుకు సాగని రెండో విడత ఆధునికీకరణ పనులు
- గదులు, మౌలిక వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు



అసంపూర్తిగా దొంకూరు ఉన్నత పాఠశాల ఫేస్-2 అదనపు తరగతి గదులు

ఇచ్ఛాపురం రూరల్: సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పించాలని, అందులో చదివే పేద విద్యార్థులు కార్పొరేట్ స్థాయి పాఠశాలల్లో చదువుతున్నామన్న అనుభూతి కలగాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద బడుల ఆధునీకరణ పనులు చేపట్టింది. మొదటి విడతలో చేసిన పనులతో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ స్కూళ్లను చూసి ఆశ్చర్యపోయారు. ఇక రెండో విడత కింద పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి, పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. ఎన్నికల వరకు పనులు వేగవంతంగా సాగాయి. ఆ తరువాత ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులకు అతీగతీలేకుండా పోయింది. పాఠశాలల అభివృద్ధి పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొన్ని పాఠశాలల్లో గదులు పూర్తయినప్పటికీ గచ్చులు, కిటికీలు, సున్నాలు వేయకుండా కాలయాపన చేస్తున్నారు. కారణాలు అడిగితే సిమెంట్ కొరత, మేస్త్రీలు రావడం లేదని, కూలీలు అందుబాటులో లేరని, నిధులు విడుదల కాకపోవడమేనని కాంట్రాక్టర్లు, అధికారులు చెబుతున్నారు. దీంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

ఐదేళ్ల వైఎస్సార్‌కాంగ్రెస్ ప్రభుత్వం మనబడి నాడు-నేడు పథకంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దింది. నాడు-నేడు పథకంలో భాగంగా మొదటి విడతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసుకొని తొమ్మిది రకాల వసతులు కల్పించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మారిన బడులను చూసి సంతోషానికి లోనయ్యారు. ఫలితంగా చెట్లకింద కూర్చొని చదవడం, ఆరుబయట కాల్యకృత్యాలు తీర్చుకోవడం, చేతి పంపుల వద్ద భోజనం ప్లేట్లు శుభ్రం చేసుకోవడం, ఇంటి నుంచి బాటిళ్ల నుంచి తాగు నీరు తెచ్చుకునే పరిస్థితులకు చరమ గీతం పాడారు. కార్పొరేట్ స్కూళ్లలో చదువుతున్నామనే భావనను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కల్పించారు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

మండలం	ఫేస్-1 పాఠశాలలు	మంజూరైన నిధులు రూ. కోట్లలో	ఫేస్-2 పాఠశాలలు	మంజూరైన నిధులు రూ. కోట్లలో
ఇచ్ఛాపురం	38	14.93	55	18.51
కవిటి	28	8.32	49	22.86
కంచిలి	33	7.18	42	18.23
సోంపేట	29	11.60	47	20.34



సున్నాలు వేయకపోవడంతో ప్రారంభానికి నోచుకోని బాలకృష్ణాపురం పాఠశాల ఫేస్-2 అదనపు తరగతి గదులు



ఫేస్-2 పనులు పూర్తి కాకపోవడంతో చెట్లు కింద చదువుతున్న బి.తోటూరు పాఠశాల విద్యార్థులు



నాడు-నేడు మొదటి విడతలో సర్వంగ సుందరంగా కనిపిస్తున్న ముచ్చింద్ర పాఠశాల

భూఆక్రమణపై చర్యలు తీసుకోండి



వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి

టెక్కలి: తనకు చెందిన భూమిని ఇతరులు ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని టెక్కలికి చెందిన ఎస్.అమరావతి టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా పలువురు నుంచి వినతులు అందుకున్నారు. విద్యుత్ స్తంభాలు సరిచేయాలని గౌడ శ్రీనివాసరావు వినతి అందించగా.. టెక్కలి మండలం కొండభీంపురం గ్రామంలో తనకు చెందిన భూమిని రికార్డులు తారుమారు చేసి ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని రాపాక రామలక్ష్మి ఫిర్యాదు చేశారు. పోర్ట్ ట్రెడ్జింగ్ పనులతో పంట పొలాల్లో ఉప్పు నీరు చేరుతోందని కె.లింగూడు గ్రామానికి చెందిన ఇప్పిలి చిన్నారావు, సింహాచలం, తన భూమిని సాగు చేస్తున్న రైతులు రికార్డులు తారుమారు చేసి భూమిని ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని హిరమండలం మండలం గులుమూరుకు చెందిన గిడుగు వెంకటనాగేశ్వరావు ఫిర్యాదు చేశారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులు, వినతుల పరిష్కారానికి సంబంధిత అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వెల్లడించారు.

ఆక్రమణలు తొలగించండి

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఆక్రమణలను తక్షణమే తొలగించాలని రెవెన్యూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పట్టుమహాదేవి కోనేరు గట్టు పై బడ్డీలు ఏర్పాటు చేసి ఆక్రమణలు చేయడం పై 'కోనేరు గట్టు పై మళ్లీ ఆక్రమణలు' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వీఆర్‌వో యుగంధర్‌తో పాటు సిబ్బంది కోనేరు గట్టును పరిశీలించి తక్షణమే ఆక్రమణలు తొలగించాలని సంబంధిత వ్యక్తులకు ఆదేశాలు జారీ చేశారు.

నాటుకోళ్లు మృతి!

టెక్కలి రూరల్: స్థానిక ఆదిఆంధ్రావీధిలో నివాసముంటున్న యర్రా గురుమూర్తికి చెందిన 20 నాటుకోళ్లు సోమవారం మృతి చెందాయి. గుర్తు తెలియని వ్యక్తులు చీమలమందు కలిపిన ఆహారం ఇవ్వడంతో కోళ్లు మృతి చెందాయని బాధితుడు గురుమూర్తి అనుమానం వ్యక్తం చేశారు.


మహిళలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: బంగారు నగలు పెట్టుకొని బయటకు వెళ్లే సమయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్ అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా సోమవారం బిర్లంగిలో గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. యువకులు గంజాయి, మద్యం వంటి మత్తుపదార్థాలకు బానిసలుగా మారుతూ ఆకృత్యాలు చేస్తున్నారని, వారిని తల్లిదండ్రులు మందలించాలని అన్నారు. ప్రతీ ఒక్కరి వద్ద స్మార్ట్ ఫోన్‌లు ఉండటం వలన సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతూ మోసపోతున్నారని అన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్‌తో పాటు బండికి సంబంధించి పత్రాలు ఉంచుకోవాలన్నారు.

మృతుడి వివరాలు తెలపండి



టెక్కలి రూరల్: టెక్కలి పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 60 సంవత్సరాల వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడని, ఎవరికైనా వివరాలు తెలిస్తే తెలియజేయాలని టెక్కలి ఎస్‌ఐ రాము సోమవారం కోరారు. మండలంలోని ఒలేసాగరం సమీప ఫ్లైఓవర్ బిడ్జి కింద తీవ్ర అనారోగ్యంతో వృద్ధుడు బాధపడుతున్న విషయం తెలుసుకున్న టెక్కలి పోలీసులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. అయితే మృతిని వివరాలు తెలియలేదన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం రూరల్: అల్పపీడనంతో ఈ నెల 11, 12 తేదీల్లో వర్షం పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఇచ్ఛాపురం వ్యవసాయాధికారి టి.భార్గవి సూచించారు. సోమవారం ఆమె మండలంలోని తేలుకుంచి తదితర గ్రామాల్లో పర్యటించి రైతులను కలిశారు. ఇప్పటికే కోసిన వరి పంటను జాగ్రత్తగా కుప్పలు వేసి భద్రపరచుకోవాలన్నారు. నూర్పు చేసిన ధాన్యం రైతుల వద్ద నిల్వ ఉంటే వాటిని సంబంధిత రైతు సేవా కేంద్రల్లోకి చేర్చి, అక్కడ నుంచి మిల్లులకు చేర్చాలని అన్నారు. 12వ తేదీ వరకు ఎటువంటి వ్యవసాయ పనులు చేయరాదని రైతులకు విజ్ఞప్తి చేశారు.

కామ్రేడ్ 'మాదాల'కు ఘన నివాళి



నారాయణస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పలాస: కమ్యూనిస్టు విలువలకు నిలువటద్దం కామ్రేడ్ మాదాల నారాయణస్వామి అని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. పలాస సూదికొండ కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో నారాయణ స్వామి 11వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ ఎంఎల్ అనుబంధ సంస్థ అయిన అఖిల భారత రైతుకూలీ సంఘానికి జాతీయ కార్యదర్శిగా, తెలంగాణా పోరాట యోధుడుగా, పార్లమెంటేరియన్‌గా ప్రజలకు నారాయణ స్వామి ఎన్నో సేవలను అందించారని గుర్తు చేశారు. కామ్రేడ్ నారాయణస్వామి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే అయినకు మనం ఇచ్చిన నిజమైన నివాళ్లు అన్నారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, మామిడి భీమారావు, ఎం.వినోద్, వంకల పాపయ్య, మురిపింటి తాతారావు, సొర్ర రామారావు, పి.సరస్వతి, గౌరమ్మ పాల్గొన్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో కవిటి విద్యార్థులు ప్రతిభ



జానపదనృత్యం ప్రదర్శనలో కవిటి విద్యార్థులు

కవిటి: జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలబాలికలు సత్తాచాటారు. వమ్మరవల్లి డైట్ కళాశాల కళా ప్రాంగణంలో సోమవారం జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఐదు విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం బెందాళం మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు వమ్మరవల్లిలో 2024 పోటీలలో భాగంగా జిల్లా స్థాయికళా ఉత్సవ్‌పోటీలలో పాల్గొన్న ఆరు విభాగాలకు గానూ ఐదు విభాగాలలో ప్రథమ స్థానం సాధించడం ద్వారా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు పేర్కొన్నారు. జానపద నృత్యం, జానపద గీతం, డ్రామా గ్రూపు, 3డీ ఆర్ట్, ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ గ్రూపు విభాగాలలో కవిటి విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు పి.బి.కె.శర్మ, యు.గిరిబాబు, ఎస్.ఏకాంబరీశ్వరశర్మలను ప్రధానోపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ తెప్పల మోహన్‌రావు అభినందించారు.

ఉద్యమాల రూపకర్త చెన్నుపాటి



టెక్కలి: లక్ష్మయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు



కంచిలి: చెన్నుపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున బాబూరావు తదితరులు

టెక్కలి: ఉపాధ్యాయ ఉద్యమాల రూపకర్త చెన్నుపాటి లక్ష్మయ్య అని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు కొనియాడారు. టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చెన్నుపాటి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. మొట్టమొదటి సారిగా ఉపాధ్యాయ ఉద్యమ సంఘాలను రూపకల్పన చేసిన మహోన్నతమైన వ్యక్తి చెన్నుపాటి లక్ష్మయ్య అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎం.అనురాధ, కె.దాలయ్య, పి.జగదీశ్వరరావు, టి.వైకుంఠరావు, కె.నారాయణరావు, పి.ఋషి, బి.ఆనందరావు, కె.మురళీకృష్ణ, ఆర్.జ్యోతి, కె.సుధారాణి, సిహెచ్.భారతి, ఎం.మోహిని, బి.నారాయణరావు పాల్గొన్నారు.

కంచిలి: ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు కామ్రేడ్ చెన్నుపాటి లక్ష్మయ్య అని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో చెన్నుపాటి 56వ వర్ధంతి కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు మురళినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల శాఖ ప్రధాన కార్యదర్శి నల్లాన రవి, కోశాధికారి టి. త్రినాథ్, దుర్గాప్రసాద్, ఎ.మోహనరావు, కవిటి మండల ప్రధాన కార్యదర్శి సీతమనాయుడు, కలియా కృష్ణారావు పాల్గొన్నారు.

గోతులు పూడ్చివేత పనులు..



టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ వరకు రూ.24 లక్షలతో గోతులు పూడ్చే పనులను సోమవారం ప్రారంభించారు. ఆర్ అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో ఇతర జిల్లాకు చెందిన వ్యక్తి గుత్తేదారుగా వ్యవహరిస్తూ చేస్తున్న ఈ పనులను టీడీపీ కార్యకర్తలు ప్రారంభించారు. . ఇటీవల అంబేడ్కర్ జంక్షన్‌లో ఇదే మాదిరిగా రోడ్డుపై తారు పూతలు వేయగా.. రోజుల వ్యవధిలోనే యథాస్థితికి చేరుకుంది. ఇప్పుడు మరోసారి హడావుడిగా చేస్తున్న పనులు ఎంత మేరకు నిలుస్తాయోనని స్థానికులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. –టెక్కలి

బండికాదు..జగమొండి..!



ఆర్టీసీ బస్సులు ఇటీవల ఎక్కడికక్కడ మొరాయిస్తున్నాయి. ఇదే పరిస్థితి మండల కేంద్రం మందసలో ఎదురైంది. మందస-బుడార్సింగ్ మార్గంలో నడిచే పలాస ఆర్టీసీ డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు సోమవారం ఉదయం బుడార్సింగికి ప్రయాణికులతో వెళ్తుండగా.. మందస మెయిన్‌రోడ్డులో ఆకస్మికంగా నిలిచిపోయింది. దీంతో కండక్టర్‌తోపాటు ప్రయాణికులు, స్థానికులు వెనక్కి.. ముందుకు కాసేపు తోయడంతో స్టార్టు కావడంతో అక్కడ నుంచి కదిలి వెళ్లింది. సంబంధిత ఉన్నతాధికారులు బస్సుల ఫిట్‌నెస్‌ను తరచూ పరిశీలించాలని ప్రయాణికులు కోరుతున్నారు. –కాశీబుగ్గ

దుప్పట్లు పంపిణీ..



కంచిలి మండలంలోని సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమంలో ఆశ్రమ వృద్ధులకు కొర్లాం గ్రామానికి చెందిన దాత, జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి రాంబుడ్డి గణపతి దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. చలితో వృద్ధులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి 30 దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రత్నాల శ్రీనివాసరావు ఉన్నారు. –కంచిలి

'ప్రకృతి' పంటలు విక్రయం..



ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటల వినియోగించడంతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని సోంపేట తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విక్రయించారు. యాంకర్ కుమారి మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలసాగుపై దృష్టిసారించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణవేణి, జయలక్ష్మి, సుజాత, శ్రావణి, పుష్పలత పాల్గొన్నారు. –సోంపేట

ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహమూర్తి

కాశీబుగ్గ: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి అన్నారు. గత ఏడాది స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కళాశాల విద్యార్థిని నిహారిక స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. సంకల్ప్-2025లో భాగంగా కళాశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల అభ్యున్నతి కోసం అధ్యాపకులు చేస్తున్న ప్రణాళికాబద్ధ బోధనకు తోడుగా ఇంటివద్ద తల్లిదండ్రులు కూడా బాధ్యత చూపాలన్నారు. సంకల్ప్‌లో భాగంగా విద్యార్థులను ఏబీసీ గ్రేడులుగా విభజించి.. సీ గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేకంగా బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రూప్ కేర్ టేకర్ ఆయా విద్యార్థుల తల్లిదండ్రులతో వారి పిల్లల విద్యా పనితీరును వివరించారు. సమావేశంలో ఏజీఎంసీ బాడ వెంకట మోహన్, ఎన్ఎస్ఎస్ అధికారి కొండల మధుబాబు, గ్రంథాలయ అధ్యాపకుడు పి.చిరంజీవు, అధ్యాపకులు వాసుదేవరావు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి చర్యలు



కవిటి: మాట్లాడుతున్న మురళీమోహనరావు



పలాస: సున్నాదేవిలో సదస్సు నిర్వహిస్తున్న అధికారులు



ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

కవిటి: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారం చూపుతామని తహసీల్దార్ బి.మురళీమోహనరావు అన్నారు. డి.జి.పుట్టుగలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. తమ భూసమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ 25 అర్జీలు అందాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ బి.కృష్ణమూర్తి, మండల సర్వేయర్ మల్లికార్జున పాణిగ్రాహి ఉన్నారు.

170 వినతుల స్వీకరణ

పలాస: పలాస మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 170 వినతులను అధికారులు స్వీకరించారు. గురుదాసుపురం, సున్నాదేవి, అమలకుడియా, వీరభద్రాపురం తదితర గ్రామాల్లో సదస్సులు జరిగాయి. వినతులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని పలాస తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి చెప్పారు. మండల సర్వేయరు గిరి, ఆర్.ఖగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం మూడో వార్డు ఏఎస్‌పేటలో రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ ఎస్.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అన్నారు.